క్లుప్తంగా

పోషకాహారం పరమౌషధం



యండగండిలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఉండి: పోషకాహారం ప్రతి మనిషికీ పరమౌషదమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. శుక్రవారం ఉండి మండలం యండగండి-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం డి.రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



మురుగు కాలువ ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని పెదఅమీరం గ్రామంలో మురుగు కాలువను ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగింపు పనులు అధికారులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఆక్రమణల తొలగింపు పనులు ఇరిగేషన్, డ్రెయినేజీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో చేపట్టారు. మురుగు కాలువ ఆనుకొని ఉన్న ఆక్రమణలు తొలగింపు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ నాగార్జున, డ్రెయినేజీ ఏఈ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న చిన్నారులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని గునుపూడి బంట్రోతు వారి వీధిలో వరసిద్ధి వినాయక స్వామి వారి 8వ వార్షిక మహోత్సవంలో భాగంగా 50 మంది బాలలచే జ్ఞాన సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు వేలూరి వినయ్, కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం 50 మంది విద్యార్థులచే సరస్వతి పూజ చేసి వారికి నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి నరసారావుపేటకు చెందిన కె.జగన్‌మోహన్‌రెడ్డి 8 గ్రాములు, డి.విశ్వేశ్వరరావు 2 గ్రాముల బంగారం సమర్పించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేండ్రలో జోరుగా శంకుస్థాపనలు



వేండ్రలో శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పాలకోడేరు: వేండ్ర గ్రామంలో 2 వ వార్డులో కల్వర్టు నిర్మాణానికి, అదేవిధంగా 10 వ వార్డ్ లో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీభూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి స్థానిక శాసనసభ్యుడి సహకారంతో ముందుకు వెళ్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పాలా జ్యోతి, వార్డు మెంబర్లు కుక్కల సాయి కృష్ణ,బుడితి నాగరాజు, వేణు, వేగి రమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

ఉండి: మనకు కలిగిన దానిలో నుండి కొంత మొత్తాన్ని నిరుపేదలు, ఆపదలో ఉండే వారి కోసం దానం చేసి ధన్యులమవుతామని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల కార్యదర్శి గాదిరాజు రంగరాజు, కో-చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి మండలం చెరుకువాడలో నిరుపేద పూరిళ్ళ సత్యనారాయణ దంపతులకు నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాన్యం వాసు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు కంటనీరు



చెరువులను తలపిస్తున్న వరి పంట పొలాలు

ఆకివీడు: గోదావరి, బుడమేరు, తమ్మిలేరు వాగుల ముంపునీరుతో రైతుల కన్నీరు ఉప్పొంగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటపై ప్రకృతి కన్నెర్రజేసింది. నారుమడులు, నాట్లు సమయంలోనే తుఫాన్ ప్రభావానికి కొట్టుకుపోయాయి. అయినప్పటికీ అన్నదాతలు సాగును వదులుకోలేదు. మళ్లీ నారుమడులు వేయడం, నారు కొనుగోలు చేసి ఖరీఫ్ సాగు ప్రారంభించారు. వరి మొక్కలు ఏపుగా ఎదుగుతున్న తరుణంలో వరద నీటికి మండలంలోని వేలాది ఎకరాల పంట నీటి పాలైంది. గత పది రోజులుగా నీట మునిగి ఉన్న వరి మొక్కలు కుళ్లిపోయాయి. ఆయా గ్రామాల్లో కుళ్లిన వరి మొక్కల నుండి దుర్వాసన వెదజల్లుతోంది.

1880 ఎకరాలకు దెబ్బ

మండలంలో 3,920 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. దీనిలో 1,880 ఎకరాలకు పైగా వరి నీట మునిగి కుళ్లిపోయింది. మరి కొన్ని గ్రామాల్లో సుమారు మరో వెయ్యి ఎకరాలకు పైగా పంట నీట మునిగి చతలు కన్పిస్తున్నాయి. మోకాలలోతు నీళ్లలో మునిగి ఉన్న ఈ ప్రాంతంలో కూడా పంట కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. గుప్పెడు గింజలు దక్కే పరిస్థితి కన్పించడంలేదని రైతులు వాపోతున్నారు. మెరక భూముల్లోని వరి పొలాల్లో నీరు నిలబడి ఉండటంతో మొక్క పిలకులు వేయకుండా ఉంది. దీనిలో ఎకరాకూ 5,6 బస్తాలకు మించి దిగుబడి వచ్చే అవకాశం లేదు. మండలంలోని 80 శాతంకు పైగా పంట వరద పాలైంది. వరదల వల్ల మండలంలోని నాలుగు వేల ఎకరాల్లో పంట నష్టం జరగగా సుమారు 1,40,000 బస్తాల ధాన్యం చేతికి అందకుండా నీటి పాలైంది. ముంపు నీరు బయటకు పోయిన తరువాత ఉపాధి హామీలో పంట బోదెలు, కాల్వల్ని బాగుచేయించి, రబీకి ఆటంకాలు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



ముంపు నీటిలో కుళ్లిపోతున్న వరి మొక్కలను పరిశీలిస్తున్న రైతులు

యూరియా చల్లవద్దు



ముంపు బారి నుంచి బయట పడిన చేలల్లో యూరియా చల్లవద్దు. దీనివల్ల మిగిలిన మొక్కలు కూడా కుళ్లిపోతాయి. ముంపునీటిని బయటకు పంపించి చేలల్లో పొటాష్ చల్లాలి. ముంపు నుంచి బయట పడినా వరి మొక్కలు, కంకులు వేస్తున్న వరి మొక్కలకు తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. - ఎంఆర్‌పీ ప్రియాంక, మండల వ్యవసాయాధికారిణి, ఆకివీడు

బాబు తప్పిదమే అపార నష్టానికి మూలం



పీవీఎల్ నర్సింహరాజు, ఉండి నియోజకవర్గ కన్వీనర్

ఆకివీడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపు లేకపోవడంవల్లే భారీ వరదలకు వేలాది కోట్ల ఆస్తి మట్టిపాలైందని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్.నర్సింహ రాజు ఆరోపించారు. బుడమేరు-విజయవాడ ముంపు, భారీ నష్టం, సంఘటనలో 36 మంది మృతిపై శుక్రవారం ఆయన మాట్లాడుతూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బుడమేరు ముంపుపై అప్రమత్తత ప్రకటనలు అధికారులు చేసినా ముఖ్యమంత్రి పట్టించుకోలేదన్నారు. వరద ఉధృతిని విజయవాడ వైపు మళ్లించి అమరావతి, తన గృహాన్ని రక్షించుకునే ప్రయత్నాలు చేశారని విమర్శించారు. ఆయన చేసిన తప్పిదానికి 2.50 లక్షల మంది మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. బుడమేరు ముంపుతో విజయవాడలోని ప్రజలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారన్నారు. వారు కోలుకునేందుకు తీసుకుంటున్న చర్యల్లో కూడా వైఫల్యాలు దొర్లుతున్నాయని మండిపడ్డారు. నిత్యవసర వస్తువులు, ఆహారం, మంచినీరు బాధితులకు అందజేయడంలో విఫలమయ్యారన్నారు. విజయవాడ వరద ప్రతి బాధిత కుటుంబానికీ రూ. 25 వేలు ఆర్థిక సహాయంతో పాటు వంట సామగ్రి, ఎలక్ట్రికల్ సామగ్రి అందించాలని పీవీఎల్ నర్సింహరాజు డిమాండ్ చేశారు. వాహనాలు పోగొట్టుకున్న వారికికూడా ప్రభుత్వం సహాయం అందజేయాలన్నారు. ఆటో, వ్యాన్, సైకిల్, మోటారు సైకిల్‌పై జీవనాధారం పొందుతున్నవారికి యుద్ధ ప్రాతిపదికన ఆయా వాహనాల్ని సమకూర్చాలన్నారు.

కొల్లేరు ముంపు బాబు చలవే

కొల్లేరు సరస్సు వరద ముంపు సీఎం బాబు చలవేనని పీవీఎల్ ఆరోపించారు. చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రి పరిపాలనలో కొల్లేరు సరస్సులోనూ, ఉప్పుటేరులో తట్ట మట్టి తీయించిన దాఖలాలు లేవన్నారు. కొల్లేరు సరస్సు తప్పిదాన్ని తనపై లేకుండా 120 జీఓను జారీ చేశారన్నారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో కొల్లేరు సరస్సు ప్రక్షాళన చేపట్టారని, ఉప్పుటేరులో పూడికలు కొంత మేర తీయించారని చెప్పారు. కొల్లేరుకు బుడమేరు నీటిని వదిలారని, అటు గోదావరి, ఇటు బుడమేరుతో కొల్లేరు తీరగ్రామాలు ముంపు బారిన పడ్డాయన్నారు. కొల్లేరు పరిరక్షణకు దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని పీవీఎల్ డిమాండ్ చేశారు. ఆకివీడు మండలంలో కొల్లేరు వల్ల చాలా మంది ఇబ్బందిపడ్డారన్నారు. ఎకరానికి రూ. 10 వేలు ఇస్తామని ప్రకటించారని, పదివేలతో రైతుకు ఒరిగేదేమీలేదన్నారు. రూ. 25 వేలు ఇవ్వాలని, రైతు భరోసా సొమ్ము రూ.20 వేలు తక్షణం విడుదల చేయాలని పీవీఎల్ డిమాండ్ చేశారు.

నులి పురుగుల నివారణపై అవగాహన



నులి పురుగు నివారణ మందు పంపిణీ చేస్తున్న అధికారులు



నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నులి పురుగుల నివారణ కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సరాబు సునీల్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకొకసారి 1-19 సంవత్సరాల పిల్లలు మందు వాడడం వల్ల నులిపురుగుల నుంచి సంక్రమించే వర్మ్ ఇన్ఫెక్షన్, తద్వారా వచ్చే రక్తహీనత వంటి సమస్యలు రాకుండా చేయవచ్చన్నారు. సెప్టెంబర్ 17న అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మందు పంపిణీ చేస్తామని తెలిపారు. అందుబాటులో లేని వారికి 25నఅందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.స్వాతి, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణ మాత్రలు మింగించి నులి పురుగులను నులిమేద్దామని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణ నిరంజని అన్నారు. పాలకోడేరు మండలం పరిషత్ కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నులిపురుగుల నివారణ మాత్రలను ఉపాధ్యాయులకు, వైద్య సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు తదితరులు పాల్గొనఆనరు

ఎస్ఆర్‌కేఆర్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే



భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో బాలకృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్ వంటి ఆదర్శనీయమైన ఇంజనీర్లు ప్రాజెక్టుల నిర్మించి భారతదేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దారని పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె బాలకృష్ణ మూర్తి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సివిల్ ఇంజనీరింగ్ హెడ్ ఎసిఎస్‌వి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ నూతనంగా నిర్మాణం జరుగుతున్న పోలవరం ప్రాజెక్ట్ గోదావరి డెల్టా ప్రాంతాల రైతులకు వరప్రసాదమన్నారు. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ నుంచి కేవలం మూడు టీఎంసీలు నీరు మాత్రమే ఖరీఫ్ ప్రారంభంలో లభ్యం అవుతుండగా పోలవరం ప్రాజెక్టు పూర్తయితే సుమారు 80 టీఎంసీల నీరు ఖరీఫ్ సమయంలో అందుబాటులో ఉంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతి రాజు మాట్లాడుతూ సివిల్ ఇంజనీర్లు నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , జనరేటివ్ ఏఐ వంటి టెక్నాలజీలను ఉపయోగించి త్వరితగతిన నూతన కట్టడాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా బాలకృష్ణమూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో .కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, కె సురేష్‌బాబు, ఎస్ గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి



పాందువ్వలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉండి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఉండి మండలం పాందువ్వ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పార్టీ సభ్యులు మండల కమిటీ సభ్యుడు మాదాసు గోపీ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోపీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పోరాట స్ఫూర్తితో అంచలంచలుగా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారని అన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పోరాటాలు చేసి విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, కర్షకుల సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేసి వారి అభిమాన నాయకుడుగా మంచిపేరు సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు మల్లిపూడి వెంకటేశ్వరరావు, చొప్పర్ల చిట్టిబాబు, సోడదాసి గంగయ్య, డి.దుర్గాప్రసాద్, సీహెచ్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్‌లకు నివాళ్లు

వీరవాసరం: ఒకరు అఖిలభారత నేత మరొకరు జిల్లా నేత ఇద్దరు కష్టజీవుల ఉద్యమాలకు కడవరకు నాయకత్వం వహించి ఆశయాలకు దారి చూపించిన నేతలకు విప్లవ జోహార్లు అంటూ వీరవాసరంలో సీతారాం ఏచూరి, ఆర్ సత్యనారాయణలకు సీఐటియు ఆధ్వర్యంలో జోహార్లు అర్పించారు. వారి చిత్రపటాల ముందు పుష్పగుచ్చాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, కుల మత ప్రాంతీయతత్వాలు పెరుగుతున్న నేటి తరుణంలో వారు మరణించడం విప్లవ ఉద్యమానికి తీరని లోటని అన్నారు. కార్మిక కర్షక పేద ప్రజల ఐక్యతతో ఉద్యమించడమే వారికి మనం అందించే నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు డి వరలక్ష్మి, పి నాగరత్నం మిడ్డే మీల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): గర్భిణులు ఆహార నియమాలను పాటించాలని, పోషక విలువలున్న ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని భీమవరం ఏరియా ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జ్ సుపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో గర్భిణీలకు ఉచిత పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి శుక్రవారం ఆస్పత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని అన్నారు. గైనకాలజిస్ట్ డా సుబ్బలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సులువుగా ప్రసవించగలుగుతారని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ సౌజన్యంతో 62 మంది గర్భిణులకు బత్తాయిలు, కోడి గుడ్లు, వేరుశనగ ఉండలు, బ్రెడ్స్ అందించామని, వచ్చే శుక్రవారం 30 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, న్యాయవాదులు అంబేద్కర్, ఏ వెంకటేశ్వరావు, గోపిశెట్టి మురళీకృష్ణ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఆయిల్ ట్యాంక్‌లో డీజిల్ మాయం

భీమవరం: పార్కింగ్ చేసిన లారీలోని డీజిల్ ఆయిల్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు భీమవరం టుటౌన్ ఎస్ఐ రెహమాన్ శుక్రవారం చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కె రమేష్‌నాయుడు కొమరాడరోడ్డులో లారీని ఈనెల 8వ తేది రాత్రి పార్కింగ్ చేశాడు. అయితే తర్వాత రోజు లారీని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగా స్టార్ట్ కాకపోవడంతో ఆయిల్ ట్యాంక్‌ను పరిశీలించగా దానిలోని సుమారు రూ. 35 వేలు విలువ చేసే ఆయిల్‌ను అపహరించినట్లు గుర్తించి పిర్యాదు చేశాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెహమాన్ చెప్పారు.

టాటా ఏస్ వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: పట్టణంలోని టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గరగపర్రు రోడ్డులో టాటాఏస్ వాహనం ఢీకొన్ని వ్యక్తి గాయపడినట్లు ఏఎస్ఐ స్వామి చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 10వ తేదిన ఎస్ సురేష్ తన అన్నకుమారుడు తేజను మోటారుసైకిల్‌పై తీసుకువెళ్లి టౌన్‌రైల్వేస్టేషన్‌లో వద్ద దింపి తిరిగివస్తున్నాడు. గరగపర్రు రోడ్డులోని వచ్చేసరికి టాటాఏస్ వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్సకోసం విజయవాడ తరలించగా ఆసుపత్రిని వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్వామి తెలిపారు.

వరద బాధితులకు వంట పాత్రల పంపిణీ



భీమవరం నుంచి కృష్ణాజిల్లా వరదబాధితులకు పంపిణీకి సిద్ధం చేసిన వంటపాత్రలు

భీమవరం: పట్టణంలోని ఏపీ బహుజన జేఏసీ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా కంకిపాడు మండలం తెన్నేరు, ఉప్పలూరు ప్రాంతాల్లో వరద బాధితులకు వంట పాత్రలు పంపిణీ చేస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ తాళ్లూరు మధు చెప్పారు. శుక్రవారం వంట పాత్రలతో వెళ్తున్న వాహనాన్ని ఏపీ బహుజన గౌరవాధ్యక్షుడు కాటన్ స్టాన్లీరాజు, ముఖ్య సలహాదారులు బిరుదుగడ్డ గంగాధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ భారీవర్షాలు, వరదలు కారణంగా కృష్ణా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అటువంటిని వారిని ఆదుకోవాలనే సంకల్పంతో వంటపాత్రలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బిరుదుగడ్డ రమేష్‌బాబు, పిల్లా శ్రీను, బడుగు అశోక్‌బాబు, మహిళా అధ్యక్షురాలు పాలవెల్లి మంగ, కోఆర్డినేటర్ మహిళ గరికిముక్కు మేరీ అలీషా తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు స్వచ్ఛందంగా విరాళాలు

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ వరదలతో నిర్వాసితులైన బాధితులకు ఆపన్న హస్తం అందజేసేందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. భీమవరం కలెక్టరేట్లో శుక్రవారం పలువురు దాతలు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ని కలిసి వ్యక్తిగతంగా, సంస్థల ద్వారా తమ విరాళాలు అందజేశారు. దాతలను జిల్లా కలెక్టర్ అభినందించారు. విరాళాలు అందించిన వారిలో తణుకు అక్కమాంబ టెక్స్టైల్స్ జనరల్ మేనేజర్ ఎం సత్యనారాయణ రూ.2 లక్షలు. నరసాపురం అగ్రికల్చర్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె ఎస్ వి రాజా, డైరెక్టర్స్ సజ్జా ప్రసాద్, కోరిపల్లి శ్రీను, పి.సుభాష్ రూ.1 లక్ష. తణుకు లహమ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ అరవింద్ సేరీన్ రూ.1 లక్ష, గుజరాత్ స్టేట్ పెట్రోల్ కెమికల్ లిమిటెడ్ రూ.20 వేలు జిల్లా కలెక్టరుకు అందజేశారు.

పోక్సో కేసులో ఆరేళ్ల జైలు

ఆకివీడు: స్థానిక మాదివాడకు చెందిన రౌడీ షీటర్ మద్దా సుందర్ సింగ్‌కు పోక్సో కేసులో ఆరు సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి ఎం.ఏ. సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. 2017 సంవత్సరంలో బాలికపై అత్యాచార సంఘటనపై అప్పటి ఎస్సై సుధాకరరెడ్డి కేసు నమోదు చేశారు. పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి పోక్సో కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్ఐ నాగరాజు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున మారిశెట్టి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారని, కోర్టు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి సహకరించడంతో కేసు విజయవంతంగా ముగిసిందని చెప్పారు.

రేపు ఇంజనీర్ల దినోత్సవం

ఉండి: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉండి కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే రిటైర్డ్ జాయింట్ జనరల్ మేనేజర్ విజయవాడ రుద్రరాజు వెంకటరామరాజు, వాటర్ రీసోర్స్ డిపార్ట్‌మెంట్ భీమవరం ఏఈ సోమిశెట్టి జయప్రకాష్‌ను సత్కరిస్తున్నట్లు వారు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



వనసంరక్షణ మహోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు తెలిపారు. జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్, బృందావన హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వీరవాసరంలోని ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ధ్యానశిక్షణ నిర్వహించారు. విద్యార్థులందరికి ఉచితంగా మొక్కల పంపిణీ చేసి, హైస్కూల్ నుంచి లిటిల్ బడ్స్ హైస్కూల్ వరకు వన సంరక్షణ మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పచ్చని చెట్లు-ప్రగతికి మెట్లు, పర్యావరణ పరిరక్షణ-మనందరి బాధ్యత, నింగికి చుక్కలు అందం-నేలకు మొక్కలు అందం అనే నినాదాలతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. వీరవాసరం రైల్వేస్టేషన్ స్టేషన్ సూపరింటెండెంట్ శేఖర్ బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ అధ్యక్షుడు రుద్రరాజు పెద్దివర్మ, మేకా వెంకటేశ్వరరావు, నవీన్, బి.వసంత, కె.వి.డి.ప్రసాద్, మద్దాల రాంబాబు, కె.మోహన్,సబ్బారపు వెంకటరావు, వర్రి విశ్వేశ్వర రావు, తీడ నాగరాజు, హైస్కూలు హెచ్.ఎం.శ్రీ జె.శ్రీనివాసరావు, డైరెక్టర్ కురెళ్ళ నరసింహరావు, అనేక ప్రాంతాలకు చెందిన సుమారు 80మంది పిరమిడ్ ధ్యానమిత్రులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వాకర్స్ 201 జిల్లా గవర్నర్‌గా గోపి



భీమవరం కాఫీక్లబ్ ఆధ్వర్యంలో గోపిని సత్కరిస్తున్నదృశ్యం

భీమవరం: పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు అన్నారు. మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వడుపు గోపి వాకర్స్ 201 జిల్లా గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎంపికైన సందర్భంగా శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ గోపి తనకిచ్చిన బాధ్యతలను ఎంతో బాధ్యతతో సక్రమంగా నిర్వర్తించి సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అదే విధంగా వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కో-కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, సభ్యులు రాయప్రోలు భగవాన్, కొత్తపల్లి శివరామరాజు, తోట భోగయ్య, కారుమూరి సత్యనారాయణ, కొత్త శ్రీనివాస్, బోసురాజు, పెన్నాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.